జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 4 - సంచిక: 118 | 24 డిసెంబర్ 2025 | బుధవారం | 4 పేజీలు




# జిల్లాలో ఎస్సైల బదిలీలు

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఎస్ఐల బదిలీలు చేస్తూ అదనపు డీసీపీ బస్వారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వీఆర్‌లో అటాచ్ ఉన్న ఎస్ఐ సామ శ్రీనివాస్‌ను ధర్పల్లీ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. అలాగే అక్కడే ఉన్న కళ్యాణిను వీఆర్‌కు అటాచ్ చేశారు. వీఆర్‌లో అటాచ్‌గా ఉన్న వంశీ కృష్ణను వర్ని ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. అక్కడే ఉన్న మహేష్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. అదేవిధంగా నవీపేట్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ తిరుపతిని భీమ్‌గల్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. భీమ్‌గల్‌లో ఎస్ఐగా పని చేస్తున్న సందీప్‌ను నాలుగవ టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు. నాలుగవ టౌన్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌ను నవీపేట ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నాందేడ్ కేంద్రంగా నకిలీ నోట్ల దందా..!

- గుట్టురట్టు చేసిన వర్ని పోలీసులు

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

అమాయక రైతులను అడ్డం పెట్టుకుని, బ్యాంకింగ్ వ్యవస్థనే బురిడీ కొట్టించాలని చూసిన నకిలీ నోట్ల ముఠా ఆగడాలకు వర్ని పోలీసులు చెక్ పెట్టారు. మహారాష్ట్రలోని నాందేడ్ కేంద్రంగా సాగుతున్న ఈ భారీ నెట్‌వర్క్‌ను ఛేదించి, లక్షలాది రూపాయల నకిలీ కరెన్సీతో పాటు నిందితులను కటకటాల్లోకి నెట్టారు.ఈ ఉదంతం వర్నిలోని కెనరా బ్యాంక్‌లో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిన్న సాయిలు అనే వ్యక్తి తన పంట రుణం చెల్లించేందుకు రూ. 2,08,500 నగదును బ్యాంకులో జమ చేసేందుకు వచ్చాడనీ అన్నారు. అయితే, నగదును పరిశీలించిన బ్యాంకు మేనేజర్ పంకజ్ కుమార్, అవి నకిలీ నోట్లని గుర్తించి అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఈ భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి: జడ్చర్లకు చెందిన రవికుమార్ రెడ్డి, ఆకాష్ రమేష్ జాదవ్,లు కలిసి పక్కా ప్రణాళికతో నకిలీ నోట్లను ముద్రిస్తున్నారు. వికారాబాద్‌కు చెందిన పాల్త్య కళ్యాణ్, ఎల్తం నరేడ్ల శంకర్,గోపాల్, ఎల్తం రవి,నరేడ్ల బాలయ్యలు కారులో వెళ్లి రూ. 4 లక్షల నకిలీ కరెన్సీని సేకరించారు.ఇందులో కొంత మొత్తాన్ని ఇప్పటికే చలామణి చేయగా, మిగిలిన రూ. 2,08,500లను శంకర్ అనే వ్యక్తి.. రైతు చిన్న సాయిలుకు తెలియకుండానే అతడి ఇంట్లో దాచిపెట్టాడనీ తెలిపారు. తెలియని అమాయకత్వంతో ఆ రైతు ఆ డబ్బును బ్యాంకుకు తీసుకువచ్చి అడ్డంగా దొరికిపోయాడు.నమ్మదగిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు, బోధన్ బస్టాండ్ వద్ద నిందితులను మాటువేసి పట్టుకున్నారు. నిందితుల నుంచి నకిలీ కరెన్సీ రూ. 9,86,000,2 ప్రింటర్లు, 1 ల్యాప్‌టాప్,8 సెల్ ఫోన్లు, బ్రీజా కారు (టీఎస్-16-ఈటీ - 0111), బ్లేడ్లు, స్టీల్ స్కేల్స్, సెక్యూరిటీ థ్రెడ్ కోసం ప్లాస్టిక్ రోల్స్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ముఠా ప్రధాన సూత్రధారులతో పాటు సహకరించిన వారందరినీ అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.




## 108 అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రోగ్రామ్ మేనేజర్

(నిజామాబాద్, ఇదీ సంగతి)

ప్రజలకు అందుతున్న అత్యవసర వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు 108 అంబులెన్స్‌లను మంగళవారం ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాలూరా గ్రామంలో సేవలందిస్తున్న అంబులెన్స్‌ను సందర్శించిన ఆయన, వాహనంలోని వైద్య పరికరాల పనితీరును స్వయంగా పరీక్షించారు. అంబులెన్స్‌లో ఉన్న మందుల నిల్వలను, ముఖ్యంగా మందుల కాలపరిమితి ముగిసిందా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో ప్రాణరక్షణకు ఉపయోగపడే వైద్య పరికరాల స్థితిగతులను సమీక్షించారు. రోగులను ఆసుపత్రికి తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో స్పందించే విధానంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్



మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే 108 సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సాలూరా ప్రాంత ప్రజలకు ఈ అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, ప్రజలు వీటిని ఉచితంగా వినియోగించుకోవా లని కోరారు. అంబులెన్స్ సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివ దినేష్, అంబులెన్స్ పైలట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.